

శివాలయ ప్రాంగణం ప్రశాంతంగా ఉంది. రావిచెట్టు మీద నించి వస్తున్న గాలి తెరలు గర్భగుళ్ళోని నూనెదీపాన్ని పట్టి కుదిపేస్తున్నాయ్. అంచేత చెయ్యెత్తు శివలింగంపైన కాంతి పడీ పడనట్లుగా ఉంది. ఆలయంలో గూడు కట్టుకుని స్థిర నివాసం ఏర్పరచుకున్న పిచ్చుక దంపతులు ఎవరూ లేరుగదాని మనసు విప్పి కీచ కీచ మంటున్నాయ్. అంతకు తప్పించి మరేసందడీ లేదు. అర్చకుడు కూడా గుడి తలుపులు తీసి రాత్రి తనే స్వయంగా కొండెక్కించిన దీపాన్ని మళ్ళీ కొండ దింపి, సొంత పనులు చక్కబెట్టుకోవడానికి ఊళ్ళోకి వెళ్ళిపోయాడు. ప్రతిరోజూ అలాగే వెళ్ళిపోతాడు. కాని వెళ్ళేముందు రావిచెట్టు కింద సిమెంటు అరుగుపై కూర్చు నుండే జోగయ్యతో "ఇదిగో పంతులూ, అలా వెళ్ళొస్తా గాని, దేవుణ్ణి చూస్తుండు" అ న్చెప్పి మరీ వెడతాడు.

ఆ మాటలకి జోగయ్య నవ్వుకుంటాడు. ఆ నవ్వు క్కారణం-అర్చకుడి అమాయకత్వం చూసో, లేక పరమేశ్వరుడిని గూడా తన లాంటి పామరుడు కాపాడాల్సి నందుకో-అతనికే తెలియాలి.

జోగయ్య పూర్తి పేరు, అసలు పేరు కచ్చితంగా ఎవరికీ తెలీదు. కాని అతనికి వ్యవహారిక నామాలు ఎన్నో ఉన్నాయి. జోగీ, పంతులు, పిచ్చి పంతులు వగైరా-కాని ఏ పేరుతో పిలిచినా నొచ్చుకోకుండా పలుకుతాడు. ఏ పని చెప్పినా క్షణాల్లో చేసేస్తాడు. నీళ్ళ కావిడి భుజాన వేసుకుని బిందెల కొద్దీ నీళ్ళు ఇంటింటికి చేరవెయ్యటం, పక్క ఊరి కెళ్ళి సామాన్లు తెచ్చిపెట్టడం, శృంగార భారంతో నలిగించిన మంచాలని బిగించి పెట్టడం, ఎవరైనా మరణిస్తే కొమ్ము పట్టడం... అయిన పనీ, కాని పనీ అనేది లేకుండా అడిగిన వాళ్ళకి కాదనకుండా సాయపడతాడు. ప్రతిఫలంగా ఇది కావాలని అడగడు. ఇస్తే తీసుకుంటాడు. పెడితే భుజిస్తాడు. లేదూ మళ్ళీ వెళ్ళి గుడి ముందు కూర్చుండిపోతాడు.

జోగయ్య అస లే ప్రాంతంవాడో, ఏ కులంవాడో, భార్యాబిడ్డలు ఉన్నారో లేదో మొదలైన సమాచార సేకరణకు కొంతమంది పెద్దలు ప్రయత్నించి, అతని వద్ద నించి సరైన సమాధానం రాక వదిలివేశారు. 'అసలు నీ దే ఊరు' అ నడిగితే, 'అన్ని ఊళ్ళూ నావే' నంటాడు. 'సంతానం లేదా' అ నడిగితే 'ఈ ఊళ్ళో పిల్ల లంతా నావాళ్ళే' నంటాడు. 'ఏ కులంవాడి' వంటే 'మీ కులంవాడినే' అంటాడు చమత్కారంగా. పేరూ, ఊరూ, పిల్లలూ, చివరికి కులం కూడా లేనివాడు 'పిచ్చివాడు' గాక ఇంకేమవుతా డని చెప్పి 'పిచ్చి పంతులూ' అని పిలవటం ప్రారంభించేరు. దానికి ఆ ఊళ్ళో పండితులు అభ్యంతరం తెలిపారు. జోగయ్య మెళ్ళో యజ్ఞోపవీతం లేదు కాబట్టి బ్రాహ్మణుడు కాడని, అంచేత పంతులూ అని పిలవటానికి వీల్లేదని వీళ్ళు, బ్రాహ్మణత్వానికి కేవలం జంధ్యమేనా కావలసిందని మిగిలినవాళ్ళూ... గొడవలూ, వాదోపవాదాలూ జరిగినాయ్. ఇంకా జరుగుతూనే ఉన్నాయ్. కాని జోగయ్యకి అవి పట్టవ్. తన ధోరణి తనదే.

ప్రతిరోజూ ఇంకా ఊరు నిద్ర లేవక మునుపే మేలుకుని, కాలకృత్యాలు పూర్తి చేసుకుని, స్నానం చేసి వచ్చి గుడి ముందు చతికిలబడతాడు. అతను గుళ్ళోకి వెళ్ళి ప్రార్థిస్తుండగా చూసినవాళ్ళు లేరు. అతనితో అవసరం ఉన్నవా

# దేవుడున్నాడు!

శంకరమంచి పార్థసారధి

ళ్ళంతా కబు రంపించి పిలిపించుకుంటారు. పని పూర్తికాగానే మళ్ళీ ఆలయం దగ్గరికి వచ్చేస్తాడు. అర్చకుడు గుడి మూసి వెళ్ళేటప్పుడు రెండు మూడు అరటిపళ్ళు జోగయ్యా వైపు గిరా టేసి వెడుతుంటాడు. అవే అతని ఆహారం. దేవాలయంలోకి పని గట్టుకుని వెడితే గాని శివ దర్శనం కాదు. కానీ ఆ వైపుగా వెళ్ళే ప్రతివాళ్ళకి జోగయ్యా సాక్షాత్కారం అయి తీరుతుంది. అత నంటే గౌరవం చాలా ఎక్కువమందికి తక్కువగా ఉంది. జాలి మాత్రం తక్కువమందికి ఎక్కువగా ఉంది. ఇప్పు డిప్పుడు ఆ ఊరి కుర్రకా రంతా అతడ్ని హేళన చేసి మాట్లాడటం మొదలుపెట్టేరు. అదొక ఆటగా, హాబీగా, అలవాటుగా తయారైంది.

వీళ్ళలో చాలామంది యూత్ క్లబ్‌లో సభ్యులే. దాదాపు ఏడాది క్రితం వెలిసిన ఈ క్లబ్‌లో ఇంకా చదువుకుంటున్నవాళ్ళు, చదివి ఉద్యోగా ల్లేని వాళ్ళు, చదువులు మానేసినవాళ్ళు, పనీ పాటా లేక తల్లిదండ్రుల సంపాదన పైన బతుకుతున్నవాళ్ళు-అంతా సభ్యులే. వీళ్ళంతా నూరుపైనలా ఆధునికులు. అంచేత అందరికీ దట్టంగా గడ్డాలు, జారిపడే తీగజోళ్ళు, భుజాలకి



నంచులూ ఉంటాయి. జీన్ పాంట్స్, లూజు షర్టుస్ ధరిస్తారు. ఇండియా అంటే డర్టీ ప్లేసని, పాతంతా నాన్‌సెన్సని, పాశ్చాత్య దేశాలన్నీ సస్యశ్యామల మని నమ్మి, ఆ విషయాన్ని జపం చేస్తుంటారు. వీళ్ళంతా ప్రతి ఉదయం తొమ్మిది గంటల కల్లా రాములు కిళ్ళీ షాపు కలుస్తారు. రోడ్డు వారగా ఉంటే రెండు చెక్క బల్లలపైన వరసగా కూర్చుని, అమ్ముడు కాని ఆ రోజు న్యూస్ పేపర్లని చేరొ ఒకటి పంచుకుని చదివి, చదివిన వార్తల నన్నిటిని ఒకళ్ళ కొకళ్ళు గొడవ గొడవగా చెప్పుకుంటారు. తర్వాత అరటిపళ్ళు తిని, సోడాలు తాగి, పద్దు రాసుకోమని రాములికి చెప్పి ఊళ్ళోకి వెడతారు. ఎక్కడి కెళ్ళినా అలాగే వెడతారు.

యూత్ క్లబ్ స్థాపించుకున్నాక వీళ్ళ కార్యక్రమాల పరిధి పెరిగింది. తరచు వాళ్ళనీ, వీళ్ళనీ పిల్చుకొచ్చి మీటింగులు నిర్వహించడం, దేవుడు లేడని, మతాలు, సాంప్రదాయాలు అంతా వట్టి బూటక మని ప్రచారం చెయ్యడం, వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు గుడి ముందు కూర్చు నుండే జోగయ్యని చూసి "ఏం జోగయ్యా శాస్త్రుల్లూ! అమావాస్య ఏప్పు డయింది?" అనే

"మావాడి గర్భాదాన కార్యక్రమం కాస్త దగ్గ రుండి జరిపించరూ" అనో హేళనగా చప్పట్లు చరుస్తూ నవ్వుకోవడం.

జోగయ్యకి వాళ్ళ మాటలకి కోపం రాకపోగా వాళ్ళను చూస్తుంటే జాలి వేసేది. 'పాపం జీవితం అంటే ఏవిటో తెలీనివాళ్ళు. అమాయకులు. కడదాకా ఇలాగే హాయిగా నవ్వుకుంటూ బత గ్గలిగితే అదృష్టవంతులే. కాని సాధ్యమా! వయసు పెరిగి, బాధ్యతలు నెత్తిపై కెక్కి, సమస్యలు కారుమేఘాల్లా చుట్టూ కమ్మేసి, చీకటి మయం చేసి, దారి కనపడక, దిక్కుతోచక తల్లడిల్లిపోతూ కూడా... తన లాటివాళ్ళని చూసి ఇలాగే హాయిగా నవ్వగలిగితే గొప్పవాళ్ళు, అదృష్టవంతులే... కాని... ప్చ్... పాపం.
అయినా తన కర్థం కాని విషయం ఒక టుంది. వీళ్ళంత దేవుడు లేడని గట్టిగా నమ్ముతారు. అలాగని వాదిస్తారు. అలా నమ్మటంలో అంతటి ఆనందం ఉందా? తను దేవు డున్నాడని దృఢంగా విశ్వసిస్తాడు. కాని తనకి దేవుడు ఆలయాల్లో కనిపించడు. ప్రతి మనిషిలో దేవుడున్నా డనిపిస్తుంది. చివరికి తనని ఆట పట్టించే కుర్రాళ్ళల్లో కూడా. అంతే. తనకి ప్రతి మనిషిలోనూ దేవుడు సాక్షాత్కారం అవుతుంటే, వాళ్ళ కేమో మనిషే గొప్పవాడు, దేవుడి ఉనికిని కాదని ఆ స్థానంలో మనిషిని ప్రతిష్ఠించారు. మరైతే తనని చూసి ఎందుకలా హేళనగా మాట్లాడతారు? కష్టంలో ఉన్నవాళ్ళకి సాయపడ రేం? కళ్ళ ముందు జరిగే అన్యాయాల్ని ఘోరాల్ని ప్రతిఘటించ రేం? మనుమ లంత ఒక్కటే నన్న నిజాన్ని గుర్తించరేం? వీళ్ళు పూర్వకాలపు చాదస్తపు సాంప్రదాయవాదుల కన్నా ఏ విధంగా గొప్పవాళ్ళు?

తనలోని సందేహాల నివృత్తికి ఎదురుచూస్తూన్న జోగయ్యకి ఆ అవకాశం అనుకోకుండా వచ్చింది. ఏ విధంగా నంటే...

ఓ రోజు జగన్నాధం భార్య కళావతి అకస్మాత్తుగా ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. జగన్నాధానికి పాతికేళ్ళు. కళావతికి ఇరవై. వాళ్ళిద్దరికీ పెళ్ళయి ఏడాది. ఆ పిల్ల కాపరాని కొచ్చి ఆర్నెల్లు. నెల తప్పి మూణ్ణెల్లు.

జగన్నాధం తండ్రి ధర్మారావు. అటు హోమియోపతి వైద్యాన్నీ ఇటు ఇన్సూరెన్స్ ఏజెన్సీని ఒడుపుగా ఉపయోగించి బాగా గడించేడు. పెద్ద డాబా, బాంక్ బాలన్సు, భార్య వంటి పైన నలభై తులాల బంగారం, ఇల్లంత సామాను అమర్చుకున్నాడు. ఆయనకి ముగ్గురు సంతానం. ముగ్గురూ కొడుకులే. వాళ్ళలో జగన్నాధం పెద్దవాడు. డిగ్రీ చదువుని అతి కష్టంపైన అయిం దనిపించేడు. ఉద్యోగం దొరక్క గాలికి తిరుగుతుంటే డాక్టరుగారు భయపడి పెళ్ళి డోసు వేశారు. కళావతి కాపురాని కొచ్చింది.

కళావతి తండ్రికి నలుగురూ ఆడపిల్లలే. కళావతి రెండో పిల్ల. ముప్పయి వేలు కట్నం ఇచ్చి, కాస్తో కూస్తో బంగారం కూడా ఇచ్చి పెళ్ళి చేశాడు. కూతురు సుఖం కోసం తనకి తలకి మించిన బరువే అయినా జగన్నాధాన్ని అల్లుణ్ణి చేసుకున్నాడు. జగన్నాధానికి మొదటి నుంచి వ్యాపారం అంటే మోజు. ఏదోనాటికి తను గూడా దేశంలో కెల్లా పెద్ద వ్యాపారవేత్త నవుతానని, విదేశ బాంకుల్లో డబ్బు దాచుకుంటానని గొప్ప నమ్మకం. కాని ఏ వ్యాపారం ప్రారంభించా లన్నా పెట్టుబడి పెట్టాలన్న కఠిన సత్యం అతని కాళ్ళకి అడ్డుపడుతోంది. తండ్రి చిల్లిగవ్వ ఇవ్వడని తెలుసు. ఎందువల్ల నంటే తన శక్తి సామర్థ్యాలు తండ్రికి తెలీవు కాబట్టి [తెలుసు కాబట్టి–అని ఆ డాక్టర్ తండ్రి అనుకుంటూ ఉంటాడు]. అంచేత భార్యని పుట్టింటి నించి డబ్బు తెమ్మని జగన్నాధం ఒత్తిడి ప్రారంభించేడు. కొడుకు తన వ్యాపారాలకి కావలసిన డబ్బు కోసం తన మీద ఆధారపడటంలేదని తెలుసుకుని ధర్మారావు సంతోషపడి పత్తాను పలక నారంభించాడు. దాంతో కళావతి కాపురం నరకంగా తయారయింది.

భర్త,అత్తమామలు అందరికీ ఒకే దాహం... డబ్బు... డబ్బు మనిషితో పనిలేదు. ప్రేమ, ఆప్యాయత, అనురాగం-కనీసం జాలి గూడా లేకుండా ఒకటే పోరు. హోరు. కొట్టడం, కడుపు కాల్చడం, పుట్టింటివాళ్ళని అసహ్యంగా తిట్టడం, నువ్వు చస్తే వేరే సంబంధం చేసుకుంటా ననటం-కళావతికి స్వల్పకాలంలోనే జీవితం పైన రోత పుట్టింది. మనుమ లంటే అసహ్యించుకోవడం ప్రారంభించింది. మనిషిని మనిషిగా చూడలేని ఆ మృగాలతో రాజీ పడి జీవచ్ఛవంలా బ్రతకటం ఇష్టం లేక ఒకానొక రాత్రి దారుణమైన ఘర్షణ తర్వాత, ఒళ్ళంతా కిరసనాయిలుతో తడుపుకుని, కళ్ళు మూసుకుని, కడుపులోని పసికందుని క్షమించమంటూనే భగ్గున మండిపోయింది.

తెల్లవారేసరికి ఊరంతా గుప్పుమంది.కళావతి చనిపోయిందట-కాదు చంపేశారట. వట్టి మనిషి కూడా కాదు. ఎంత ఘోరం, ఎంత దారుణం! ఆ వార్త విని జోగయ్య తన సొంత కూతురు చనిపోయినట్లుగా కుమిలిపోయాడు. డబ్బు కోసం మనుమల్ని వెంటాడి వేధించి వేటాడి, చివరికి బలి తీసుకునే ఈ రాక్షస జాతిని సమూలంగా నాశనం చేయాలన్నంత ఆవేశపడ్డాడు.

కళావతి మరణ వార్త తెలుసుకుని వచ్చేసరికి ఆమె తల్లితండ్రులకి చివరి చూపు కూడా దక్కకుండా దహనం గూడా పూర్తిచేశారు. పొయ్యి రాజేస్తుంటే ప్రమాదవశాత్తు పోయిందని జగన్నాధం తల్లిదండ్రులు చెప్పిన మాట వాళ్ళని సంతృప్తిపరచలేకపోయింది. ఊళ్ళో వాళ్ళ ద్వారా విషయాలన్నీ తెలుసుకుని మరింత కుమిలిపోయారు. ఇంత కసాయి కోతని, ఇన్ని కష్టాల్ని ఎన్నెన్ని కన్నీళ్ళను తను వంటరిగా అనుభవించి, నిశ్శబ్దంగా నిష్క్రమించిన కూతురి ఔన్నత్యం వాళ్ళ గుండెలకి నిప్పెట్టగా ఆ మంటలకి తాళలేక, వెళ్ళి పోలీసు కంప్లయింటు ఇచ్చేరు. జగన్నాధాన్ని అతడి తల్లిదండ్రులని పోలీసులు అరెస్టు చేసి తీసుకుపోయారు.

సరిగ్గా ఇరవై అయిదు నిమిషాల తర్వాత వాళ్ళు బెయిలు మీద తిరిగి బయటి కొచ్చేశారు. వాళ్ళు అలా బయటికి రావడానికి కావాల్సిన ఏర్పాట్లు యూత్ క్లబ్ సభ్యులు ఉత్సాహంగా చేశారు. కారణం-జగన్నాధం గూడా వాళ్ళ సమాజంలో సభ్యుడు కావడమే.

జగన్నాధం తండ్రి వెంటనే ప్రసిద్ధి పొందిన అడ్వకేటుతో సంప్రదించేడు. త నడిగి నంత ఫీజు ఇస్తే సై అన్నాడు. జగన్నాధం తండ్రికి ధైర్యం వచ్చింది. కొడుక్కి మళ్ళీ పెళ్ళి చేస్తే ఈ ఖర్చు గూడా కట్నంలో కలిపి పుచ్చుకోవచ్చు గదాని సరే నన్నాడు.

ఈ విషయాన్ని ఊళ్ళో అందరితో పాటు జోగయ్య కూడా విన్నాడు. కాని అందరి లాగా విని తన కేం పట్టనట్టు ఉండిపోతే బావుండేది. కాని అలా ఉండలేకపోయాడు. ఆలోచించిన కొద్దీ అతనిలో ఆవేశం అధికం కాసాగింది.

"ఘోరమైన నేరస్థుణ్ణి చట్టం అదుపులోకి తీసుకుంటే పది నిమిషాల్లో అతను పూచీకత్తు మీద ప్రజల్లో కొచ్చేస్తున్నాడు. అడిగినంత ఫీజు పుచ్చుకుని అతను నిర్దోషని వాదించేందుకు మేధావి వకీళ్ళు ఉండనే ఉన్నారు. ఏళ్ళ తరబడి కేసు నడుస్తుంది. ఈలోపు జరగవలసిన సర్దుబాట్లు జరిగిపోతాయి. అవినీతిపరుడని చర్య ప్రారంభిస్తే అతగాడు కోర్టు కెళ్ళి స్టే తెచ్చుకుంటాడు. ఆ తర్వాత తంతు మామూలే. డబ్బుంటే చట్టం మీ చుట్టంలా సాయపడుతుంది. న్యాయం పుష్కలంగా దొరుకుతుంది.

జోగయ్య కళ్ళు ఎర్రబడ్డాయ్-కళావతి మరణించిన దగ్గర్నుంచి అత నెందుకో అశాంతిగా ఉంటున్నాడు. నా కెందుకొచ్చిన గొడవ అని మునుపటిలాగా ఊళ్ళో వాళ్ళ పనులు



చేయలేకపోతున్నాడు. తనలోని అశాంతి, బాధల కారణం తన ఆలోచనల దోషమా లేక సమాజమే దోష మార్గంలో పోతోందో తెలుసుకోలేకపోయాడు. ఎవరినైనా అడిగి తన అనుమాన నివృత్తి చేసుకోవాలనుకుని బయలుదేరాడు.

జోగయ్య వచ్చేసరికి రాములు కిళ్ళీ బడ్డీ దగ్గర చెక్క బల్లలు యూత్ క్లబ్ సభ్యుల బరువులకి మూలుగుతున్నాయ్. శత్రువుల తూటాల ధాటికి రాలిపోతున్న సిపాయిల్లా గెలలోని అరటిపళ్ళు తరిగిపోతున్నాయ్. జోగయ్యని చూడంగానే వాళ్ళలోని హాస్య రసం ఉప్పొంగగా "అరటిపండు తింటావా పంతులూ? కాని అరటిపండులో మాంసకృత్తు లున్నాయిట. ఎక్కడో చదివాను" అని వొక డంటే, "నో ప్రాబ్లెమ్-పంతులు కలవాటే" అని ఇంకోడు అనగా అంతా ఘొల్లు మన్నారు.

జోగయ్యలో 'నేను'అన్న అహం లేదు.అంచేత వాళ్ళ మాటలు అతన్ని నొప్పించలేకపోయాయి. ప్రస్తుతం అతనిలో ఉన్నది కళావతి మరణం తాలూకు బాధ ఒక్కటే. వాళ్ళ మాటలు పట్టించుకోనట్లుగా వచ్చి వాళ్ళ మధ్యగా నిలబడి "కళావతి చచ్చిపోయింది. మీకూ తెలును. గంపెడు కలల్ని నిజం చేసుకోవడానికి కొండంత ఆశతో మన ఊరు కాపురాని కొచ్చిన ఆడపిల్ల బ్రతకడానికి భయపడి, బలవంతపు చావుని కోరుకోవడానికి పరోక్షంగా కారకు లెవరో కాస్త ఆలోచన చేయండి. నేను పాతకాలం వాడిని, చదువుకోనివాడిని. కాని మీ రంతా అలా కాదు. గొప్పింటి పిల్లలు. మారిపోతున్న ప్రపంచానికి, రాబోయే కాలానికి వారసులు. అంచేత కాసంత మనను పెట్టి ఆలోచించండి-

"మీకు దేవు డంటే నమ్మకం లేదు. దేవుడే లే డంటారు. సాటి మనిషే దేవు డంటారు. తప్పని నే ననను. కాని ఒక మనిషి ఇంకో మనిషిని ధన దాహం కొద్దీ పీడించి, హింసించి, చిత్రవధ చేసి చివరికి ఆ జీవితాన్ని పొట్టన పెట్టుకుంటే వాడు దేవు డెలా అవుతాడు? బలిష్టు డయినవాడు బలహీనుణ్ణి దోచుకుంటుంటే న్యాయం దొరికే దెక్కడ! న్యాయస్థానాల్లోనా? ప్రధానమంత్రిని పట్టపగలు పదిమంది ముందు కాల్చి చంపిన కిరాతకుణ్ణి, నమ్మకద్రోహుల్ని ఇంకా వాళ్ళు చేసింది నేరమా, కాదాని కోర్టుల్లో విచారణ జరిపించే టంత ఆత్మవంచన చేసుకునే నికృష్టమైన పరిస్థితిలో మనమంతా పడిపోయేం. డబ్బు కోసమో, పేరు కోసమో వాళ్ళు చేసింది నేరం కాదని, అసలు వాళ్ళు నేరస్తులు కాదని వకాల్తా పుచ్చుకుని వాదించే ప్రబుద్ధులు, మేధావులు తయారవుతుంటే సామాన్యుడి గతేం కాను? వాళ్ళ బ్రతుకు లేం కాను? మీలాంటి వాళ్ళంతా నడుం బిగించి న్యాయం కోసం పోరాడతా రా? ఊఁహు. మీకు స్నేహం ముఖ్యం. నమ్మిన సిద్ధాంతం ఇంకో మనిషి జీవితం కన్నానేరం చేసిన స్నేహితుణ్ణి రక్షించుకోవడం ముఖ్యం. ఒకరి దయా దాక్షిణ్యాల ఆధారంగా ఇంకోడు బతకటం సమానత్వం అనిపించుకోదు. అందువల్లనే మనిషి చేయలేని .పని మతం చేస్తుంది. మనిషిని పాపం, పుణ్యం పేరున భయపెట్టి లొంగదీస్తుంది. పాప కార్యాలకి చచ్చేక నరకయాతన పడాల్సి ఉంటుందన్న భయం కొద్దీ మనిషి రాక్షసుడిలా మారిపోకుండా ఉండగలుగుతాడు. మీరే ఆలోచించండి. ఒక్క రోజు ఈ పోలీసు వ్యవస్థంతా విశ్రాంతి పుచ్చుకుని, ఈ ఇరవై నాలుగ్గంటలూ ఏం చేసినా నేరం కాదని ప్రకటించి చూడండి. ఎంతమంది పెద్ద మనుషులు, పేరున్నవాళ్ళు, నీతిశాస్త్రాలు వల్లించేవాళ్ళు ఏ ఏ స్థితికి, గతికి దిగజారి హీనంగా, అసహ్యంగా,దారుణంగా వీధిన పడి కరుచుకునే కుక్కల్లాగా ప్రవర్తిస్తారో ఊహించండి. మతం నిజమైన పోలీసులా సామాన్యుణ్ణి బలవంతుడి బారి నుండి కాపాడుతుంది."

జోగయ్య మొకం ఆవేశంతో ఎర్రబడింది. గొంతు బొంగురుపోయింది. ఎర్ర కళ్ళల్లో నీళ్ళు చిమ్మినాయి.

"పసిపిల్లవాడు మారాం పెడుతుంటే తల్లి 'అదిగో-బూచివా డొస్తున్నా'డని భయపెడుతుంది. పిల్లవాడు గొడవ మాని తల్లి రొమ్ముల మధ్యన దూరి నిద్రపోతాడు. బూచివాడు లేడని తల్లికి తెలును కాని పిల్లవాడికి తెలీదు!"

జోగయ్య వాగ్ధాటిని చూసి వాళ్ళు విస్తుపోయారు. అతనిలోని ఆవేశాన్ని కోపాన్ని చూసి కాస్త జంకిన మాట వాస్తవం కాని, అంతలోనే తేరుకున్నవాళ్ళల్లో ఒకడు, 'అంటే నువ్వు చెప్పేది మతం. దేవుడు వగైరా లేవు కాని, ఉన్నాయని చెప్పి జనాన్ని భయపెట్టాలని... అంతేనా!' అ నడిగాడు బింకంగా.

జోగయ్య ఆ కుర్రాడి వంక కొద్ది క్షణాలు తేరిపార చూసి, 'దేవు డు లేడని అనకండి. దేవు డున్నాడు. మీరు అతన్ని చూడలేకపోతున్నారు. అంతే! దేవు డంటే మడి బట్టలు, ఆచారాలు, పూజలు, ప్రసాదాలు, తీర్థయాత్రలు, గుళ్ళు గోపురాలు కానే కావు. దేవు డంటే ప్రేమ. ప్రేమతత్వమే దేవుడు. ప్రేమించటం నేర్చుకోండి. ప్రతి మనిషిలోనూ దేవుడు కనిపిస్తాడు. గౌతముడు, గాంధీ, జీసెస్, పరమహంస వీళ్ళందరికీ దేవుడు ఎక్కడో కాడు, మనలాంటి సామాన్యుల మధ్యనే సాక్షాత్కరించేడు. చూడగలిగితే దేవుడు సర్వాంతర్యామి. విరగపూసిన పూలచెట్లలో, శీతాకాలపు లేత సూర్యకిరణంలో, పసివాడి బోసి నవ్వుల్లో, పేగులు తెంచుకుని, కండలు చీల్చుకుని పుట్టు కొచ్చిన పసివాడిని, అనుభవించిన ప్రసవవేద నంతా మరచిపోయి తమకంగా తొలిసారి తాకి చూసుకుంటున్న కన్నతల్లి వేళ్ళ చివర్న... ఎక్కడ లేడు దేవుడు?"

జోగయ్యలోని బాధ, ఆవేశాలు వాళ్ళకి సహజంగా అర్థం కాకపోగా పైత్యపు వాగుడులా అనిపించి, 'ఇంతకీ ఏవిటి ను వ్వనేది' అనే ప్రశ్నతో అతడి ధోరణికి ఆనకట్ట వేయ ప్రయత్నించారు.

జోగయ్య వాళ్ళందర్ని బతిమాలుకుంటున్న ధోరణిలో, 'కళా'వతిని డబ్బు కోసం చంపేశారు. కేసు కోర్టు కొచ్చింది. ధన బలంతో ఆమె హత్యని ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనలా, సహజమైన చావులా రుజువు చేసేందుకు ప్రయత్నాలు జోరుగా జరిగిపోతున్నాయి. అలాగని ప్రమాణం చేసి అబద్ధాలు చెప్పడానికి సాక్షులు సిద్ధంగా ఉన్నారు. వాదించడానికి తల పండిన లాయరు ప్రత్యేకంగా ఊళ్ళోకి దిగబడ్డారు. ఈ కేసు పూర్తయ్యి, దోషులకి శిక్ష పడి, డబ్బు కన్నా మానవ ధర్మం గొప్పదని రుజు వయ్యేవరకు నేను నిరాహారదీక్ష చేయబోతున్నాను. నిజంగా మీరు వల్లించేవాటిపైన మీకు ఏమాత్రం గౌరవం ఉన్నా నా వెనక రండి. అంతే నే కోరేది" అంటూ అర్భక శరీరాన్ని గాలికి ఎగరేసుకుంటూ వేగంగా వెళ్ళిపోయేడు జోగయ్య.

** ** **

కళావతి కేసు కోర్టులో చాలా కాలం నడిచింది. అన్నం ముట్టనని ప్రతిజ్ఞ పట్టిన జోగయ్య మూడు రోజులు ఆ మాటపైనే నిజాయితీగా ఉండగలిగాడు. నాలుగో రోజు తెల తెలవారుతుంగా, ఈ అన్నంతో నీళ్ళతో, గాలితో, ఈ ద్వంద్వ నీతి మేధావులతో, శుష్క వాదాలతో అతనికి అవసరం లేకుండాపోయింది. అతని మరణం ఆ ఊళ్ళో ఎవర్నీ పెద్దగా కదిలించలేకపోయింది. ఇన్నాళ్ళూ అతన్ని వాడుకున్నవాళ్ళంతా ఒక్క వేడి నిట్టూర్పుతో అతన్ని మరచిపోయేరు.

ఈ దేశంలో డబ్బు, పలుకుబడి, తల నెరిసిన లాయరు ఉంటే ఏ న్యాయానికి అన్యాయం జరుగుతుందో, ఏ అన్యాయానికి న్యాయం జరుగుతుందో-సరిగ్గా అలాగే జరిగింది.

బలమైన సాక్ష్యాలు లేవన్న కారణంగా జగన్నాథం, అతని తల్లిదండ్రులు విడుద లయ్యేరు.

ఆరు నెలలు తిరగకుండా జగన్నాధానికి రెట్టింపు కట్నం ఇచ్చి మళ్ళీ పిల్ల నిచ్చేరు. వ్యాపారం ప్రారంభించేడు. ఎన్నో మోసాలు నేర్చుకున్నాడు. అంచేత అతి స్వల్పకాలంలో రెండు చేతులా పుష్కలంగా సంపాయించి ఆ ఊళ్ళో అతి ముఖ్యు డయ్యేడు. నేరాలు, మరణాలు, మానభంగాలు విస్తృతంగా జరిగిపోతున్నాయ్. కోర్టుల్లో కేసులు పెరిగిపోతున్నాయ్. డబ్బున్నవాళ్ళు ఎగబడి న్యాయాన్ని కొనుక్కుంటున్నారు. అసమర్థులు, బలహీనులు, రహస్యంగా గొణుక్కుంటున్నారు.

కాలం పరిగెడుతూనే ఉంది.... ★

